# పాక్‌లో రైలు హైజాక్

- బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ దుశ్చర్య
- 500 మందితో వెళుతున్న రైలుపై కాల్పులు
- బందీలుగా 214 మంది ప్రయాణికులు
- 30 మంది భద్రతా సిబ్బంది కాల్చివేత
- బలూచ్ రాజకీయ ఖైదీలను 48 గంటల్లోగా విడుదల చేయాలని పాక్ సర్కారుకు అల్టిమేటం
- పాక్ సైన్యం కౌంటర్ ఆపరేషన్ ప్రారంభం

న్యూఢిల్లీ, మార్చి 11: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్సులో మంగళవారం 500 మంది ప్రయాణికులతో వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును వేర్పాటువాద తీవ్రవాదులు హైజాక్ చేశారు. పెషావర్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌పై దాడి చేసి దాదాపు 214 మందిని బందీలుగా పట్టుకున్నారు. రైలును ఓ సొరంగంలో నిలిపి ఉంచినట్టు తెలుస్తోంది. ఈ దాడికి తామే బాధ్యులమంటూ వేర్పాటువాద తీవ్రవాద గ్రూపు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్‌ఏ) ప్రకటించింది. 30 మంది భద్రతా సిబ్బందిని చంపివేసినట్టు బీఎల్‌ఏ వెల్లడించింది. పాకిస్థాన్ ప్రభుత్వం తమపైన సైనిక చర్యకు దిగితే బందీలందరినీ కాల్చివేస్తామని బీఎల్‌ఏ హెచ్చరించింది. కాగా, పాకిస్థానీ భద్రతా దళాలు రైలు నిలిచిపోయిన ప్రదేశానికి చేరుకుని ఎదురుదాడి ప్రారంభించినట్లు వార్తలు అందాయి. హెలికాప్టర్ ద్వారా బాంబులు వేయడంతోపాటు నేలపైనుంచి కూడా భద్రతా సిబ్బంది కాల్పులు జరుపుతున్నట్టు తెలుస్తోంది. అయితే సైన్యం కాల్పులను తిప్పికొట్టినట్టు బీఎల్‌ఏ ప్రకటించింది. సైన్యాన్ని అక్కడి నుంచి తరిమివేశామని వెల్లడించింది. హెలికాప్టర్ల ద్వారా బాంబు దాడులు కొనసాగుతున్నట్టు బీఎల్‌ఏ తెలిపింది. బలూచ్ రాజకీయ ఖైదీలను 48 గంటల్లోగా విడుదల చేయాలని పాక్ ప్రభుత్వానికి అల్టిమేటం జారీచేసింది. మరోవైపు, సైనికులు, డాక్టర్లతో సంఘటనా స్థలానికి రిలీఫ్ రైలును పాక్ సైన్యం పంపినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అంబులెన్సులు కూడా అక్కడకు బయల్దేరినట్టు పేర్కొన్నాయి.

**రైల్వే ట్రాకును పేల్చివేసి..**

బలూచిస్థాన్‌లోని క్వెట్టా నుంచి పెషావర్ వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై భీకర కాల్పులు జరిగినట్టు వార్తలు వచ్చాయని బలూచిస్థాన్ ప్రావిన్షియల్ ప్రభుత్వ ప్రతినిధి షాహిద్ రింద్ ప్రకటించారు. రైల్వే ట్రాకును తమ సైనికులు పేల్చివేయడంతో జాఫర్ ఎక్స్‌ప్రెస్ ఒక సొరంగంలో నిలిచిపోయిందని, ప్రయాణికులందరినీ బందీలుగా పట్టుకోవడంతోపాటు రైలును పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నామని బీఎల్‌ఏ ఓ ప్రకటనలో తెలిపింది. తమ గ్రూపునకు చెందిన ప్రత్యేక విభాగాలైన మజీద్ బ్రిగేడ్, ఫతే స్క్వాడ్ సంయుక్తంగా ఈ దాడి జరిపినట్టు వెల్లడించింది. ఎటువంటి సైనిక చర్యకు పాల్పడినా ప్రతిస్పందన అంతే తీవ్రంగా ఉంటుందని హెచ్చరించింది. తీవ్రవాదుల కాల్పులలో రైలు డ్రైవర్ గాయపడినట్టు పోలీసులు, రైల్వే అధికారులు తెలిపారు.






**బందీలలో ఐఎస్ఐ, సైన్యం, ఏటీఎఫ్**

ఇదిలా ఉండగా సహాయక బృందాలు, భద్రతా దళాలు ఘటనా స్థలికి చేరుకున్నాయి. తీవ్రవాదుల ఆచూకీని కనుగొనేందుకు భద్రతా సిబ్బంది చర్యలు చేపట్టారు. దాడిలో తీవ్రంగా గాయపడిన ఇంజిన్ డ్రైవర్‌కు సహాయపడేందుకు అత్యవసర సహాయ బృందాన్ని ఘటనా స్థలికి పంపినట్టు స్థానిక మీడియా వెల్లడించింది. తీవ్రవాదులకు బందీలుగా మారిన వారిలో పాకిస్థానీ సైన్యం, పోలీసు, ఉగ్రవాద నిరోధక దళం(ఏటీఎఫ్), ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ) సిబ్బంది కూడా ఉన్నారు. వీరంతా సెలవుపై పంజాబ్‌కు వెళుతున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

**మహిళలు, పిల్లలు విడుదల**

మహిళలు, పిల్లలు, బలూచ్ ప్రయాణికులను విడుదల చేశామని బీఎల్‌ఏ ప్రకటించింది. దీంతో తీవ్రవాదుల చెరలో బందీలుగా మిగిలింది కేవలం పాకిస్థానీ భద్రతా దళాలకు చెందిన సిబ్బంది మాత్రమేనని తెలుస్తోంది. ఈ ఘటనలో కొందరు మరణించారు. బందీల పరిస్థితి గురించి బలూచ్ అధికారులు, రైల్వే అధికారులు వెల్లడించవలసి ఉంది. పాకిస్థాన్ నుంచి బలూచిస్థాన్‌కు విముక్తి కల్పించాలని వివిధ బలూచ్ వేర్పాటువాద గ్రూపులు గత కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తుండగా ఇటీవలనే పాకిస్థాన్, చైనాకు వ్యతిరేకంగా బలూచ్ నేషనల్ ఆర్మీ పేరిట ఓ కొత్త తీవ్రవాద గ్రూపు ఏర్పడింది. అనేక ఏండ్లుగా వేర్పాటువాద సమస్యను ఎదుర్కొంటున్న పాకిస్థాన్ ఇటీవలి కాలంలో అనేక ఉగ్రవాద దాడులను ఎదుర్కొంది. తాజాగా మార్చి 5న ఖుజ్దార్ జిల్లాలో జరిగిన ఐఈడీ పేలుడులో ఐదుగురు మరణించగా మరో ఐదుగురు గాయపడ్డారు.

### బీఎల్‌ఏ లక్ష్యమేంటి?

బలూచిస్థాన్‌లో చురుకుగా వేర్పాటువాద కార్యకలాపాలు సాగిస్తున్న గ్రూపులలో బీఎల్‌ఏ ప్రధానమైంది. రాజకీయంగా, ఆర్థికంగా పాకిస్థాన్ ప్రభుత్వం నుంచి వేరుపడి స్వతంత్ర బలూచిస్థాన్ ఏర్పరచాలన్నదే బీఎల్‌ఏ లక్ష్యం. పాకిస్థానీ భద్రతాధికారులు, ప్రభుత్వ కట్టడాలు, స్థావరాలు ప్రత్యేకంగా చైనా-పాకిస్థాన్ ఎకనమిక్ కారిడార్ కింద చైనా నిధులతో నిర్మించిన కట్టడాలపై బీఎల్‌ఏ అనేక దాడులు జరిపింది. పాకిస్థాన్‌లో బీఎల్‌ఏ నిషేధానికి గురైంది. మరి కొన్ని దేశాలు దీన్ని ఉగ్రవాద సంస్థగా గుర్తించాయి. బీఎల్‌ఏకి చెందిన ప్రత్యేక దళాల విభాగమైన మజీద్ బ్రిగేడ్ ఆత్మాహుతి దాడులు చేస్తుంది. 1974లో అప్పటి ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో హత్యకు ప్రయత్నించిన అబ్దుల్ మజీద్ బలూచ్ గౌరవార్థం ఆయన పేరుతో ఏర్పడిన ఈ గ్రూపు అనేకమంది ప్రముఖులపై దాడులకు పాల్పడింది. 1947లో బ్రిటిష్ పాలకులు దేశాన్ని విడిచి వెళ్లిపోతూ బలూచిస్థాన్‌తో కలుపుకుని ఉన్న కలాత్ సంస్థానానికి కూడా స్వాతంత్ర్యం ప్రకటించారు. అయితే దాని హోదా వివాదాస్పదంగా మారింది. దీంతో కలాత్ రాజుతో చర్చలు జరిపిన పాక్ 1948 మార్చిలో లాంఛనంగా తన దేశంలో విలీనం చేసుకుంది. ఇది తిరుగుబాటుకు దారితీసింది. 1948, 1958-59, 1973-77లో తిరుగుబాటు జరగగా 2004 నుంచి తమకు మరింత ఆర్థిక, రాజకీయ ప్రతిపత్తి కావాలన్న డిమాండ్లు బలూచ్ ప్రజల నుంచి పెరిగిపోయాయి.

### అడుగడుగునా దోపిడీ, అణచివేత

బలూచ్ పౌరులపై పాకిస్థాన్ ప్రభుత్వం సాగించిన మారణకాండ, దాడులే వారు ఆ దేశం నుంచి విడిపోవాలని బలంగా కోరుకోవడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇందులో బలవంతపు అదృశ్యాలు కూడా ప్రధాన కారణం. జాతి వివక్షను ఎదుర్కొంటున్న బలూచ్ ప్రజలపై పాకిస్థాన్ ప్రభుత్వం సాగించిన దుశ్చర్యలలో ఇదొకటని వారు చెబుతున్నారు. 2011 నుంచి 2024 జనవరి వరకు పాకిస్థాన్‌లో మొత్తం 10,078 మంది అదృశ్యం కాగా వారిలో 2,752 మంది బలూచ్ పౌరులేనని ఐక్యరాజ్యసమితిని ఉటంకిస్తూ ఫ్రెంచ్ వార్తా సంస్థ లె మాండే వెల్లడించింది. 2001-2017 మధ్య 5,228 మంది బలూచ్ పౌరులు అదృశ్యమైనట్టు ది వాయిస్ ఫర్ బలూచ్ మిస్సింగ్ పర్సన్స్ వెల్లడించింది. నైరుతి పాకిస్థాన్‌లో ఉన్న బలూచిస్థాన్ దేశంలోని మొత్తం భూభాగంలో 44 శాతం వైశాల్యం కలిగి ఉన్నప్పటికీ పాక్‌లోని మొత్తం 24 కోట్ల జనాభాలో కేవలం 6 శాతం మాత్రమే ఇక్కడ నివసిస్తున్నారు.




మన నగరాలు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. ప్రపంచ వాయు నాణ్యత నివేదిక-2024 ప్రకారం అత్యంత కాలుష్య భరిత 20 నగరాల్లో 13 మన దేశంలోనే ఉన్నాయి. కాలుష్య రాజధానుల్లో వరుసగా ఆరో ఏడాది కూడా ఢిల్లీ మొదటి స్థానంలో నిలిచింది.



**కాలుష్యంలో టాప్-5 దేశాలు**

- చాద్
- బంగ్లాదేశ్
- పాకిస్థాన్
- డీఆర్ కాంగో
- ఇండియా

**రాజధానుల్లో టాప్-5**

- ఢిల్లీ- ఇండియా
- ఎంజామెనా-చాద్
- ఢాకా-బంగ్లాదేశ్
- కిన్సాసా-కాంగో
- ఇస్లామాబాద్-పాక్

**కాలుష్యంలో టాప్-20 నగరాలు**

బర్నిహాట్ (ఇండియా), ఢిల్లీ(ఇండియా), కారాగాండా (కజకిస్థాన్), ముల్లాన్‌పూర్ (ఇండియా), లాహోర్ (పాక్), ఎంజామెనా (చాద్), ఫరీదాబాద్(ఇండియా), లోని (ఇండియా), న్యూఢిల్లీ(ఇండియా),ముల్తాన్ (పాక్), పెషావర్(పాక్), సియాల్‌కోట్(పాక్), గురుగ్రామ్ (ఇండియా), గంగానగర్(ఇండియా), హోటన్ (చైనా), గ్రేటర్ నోయిడా(ఇండియా), భీవండి (ఇండియా),ముజఫర్‌నగర్ (ఇండియా), హనుమాన్‌గఢ్(ఇండియా), నోయిడా(ఇండియా)



### 10 వేల కోట్లిచ్చినా ఎన్‌ఈపీ అమలుచేయం

**కేంద్రానికి స్టాలిన్ స్పష్టీకరణ**

*చెన్నై, మార్చి 11: కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) ఒక 'విధ్వంసక నాగ్‌పూర్ ప్రణాళిక' అని, కేంద్రం దానికి 10 వేల కోట్ల రూపాయల నిధులు ఇచ్చినా దాని అమలుకు తమ రాష్ట్రం అంగీకరించదని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పునరుద్ఘాటించారు. మంగళవారం చెంగల్పట్టులో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హిందీ, సంస్కృత భాషలను అనుమతిస్తే తమిళనాడుకు రూ.2,000 కోట్లను ఇస్తామంటూ అహంకారపూరితంగా సోమవారం పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారన్నారు. జాతీయ విద్యావిధానం ప్రవేశపెడితే అది రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను నాశనం చేస్తుందని ఆయన చెప్పారు.*

## డీలిమిటేషన్‌పై రాజ్యసభలో రభస

న్యూఢిల్లీ, మార్చి 11: జనాభా ప్రాతిపదికన జరిగే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ప్రతిపక్ష సభ్యులు రాజ్యసభలో నిరసనకు దిగారు. వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేయడంతో మంగళవారం సభ పలుమార్లు వాయిదా పడింది. నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను చర్చించడానికి సభా కార్యకలాపాలను పక్కనపెట్టాలని కోరుతూ 267 నిబంధన కింద ప్రతిపక్ష ఎంపీలు నోటీసులు ఇవ్వగా వాటిని డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తోసిపుచ్చడంతో సభ్యులు నిరసన తెలిపారు. అయితే జీరో అవర్‌లో డీఎంకే సభ్యుడు ఆర్ గిరిరాజన్ ఈ అంశాన్ని లేవనెత్తుతూ కుటుంబ నియంత్రణను అమలు చేసిన కేరళ, తమిళనాడు, పంజాబ్ వంటి రాష్ట్రాలు పార్లమెంటరీ స్థానాలను కోల్పోనుండగా కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను పట్టించుకోకుండా జనాభాను పెంచుకున్న ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలు అధిక పార్లమెంటరీ స్థానాలు పొందనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

### ఖర్గే వ్యాఖ్యలపై దుమారం

ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై రాజ్యసభలో దుమారం రేగింది. ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన వెంటనే విద్యా శాఖ పనితీరుపై చర్చను ప్రారంభించాలని కాంగ్రెస్ సభ్యుడు దిగ్విజయ్ సింగ్‌ను హరివంశ్ కోరారు. అదే సమయంలో జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ నల్ల చొక్కాలతో హాజరైన డీఎంకే సభ్యులు మంత్రి ప్రధాన్ క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. ఈ క్రమంలో జోక్యం చేసుకున్న ఖర్గే.. ఉదయం తాను మాట్లాడేటప్పుడు ప్రధాన్ సభలో లేరన్నారు. కేంద్రం నిరంకుశంగా ప్రవర్తిస్తున్నదన్నారు. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు విపక్షాలు సిద్ధంగా ఉన్నాయన్న అర్థం వచ్చేలా ఓ హిందీ పదాన్ని వాడారు. ఇది అభ్యంతరకరంగా ఉన్నదని అధికార పక్షం ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే తాను ఆ వ్యాఖ్యలు సభాపతిని ఉద్దేశించి చేసినవి కావని ఖర్గే వివరణ ఇచ్చారు.

### సుంకాల తగ్గింపుపై చెరో మాట

అమెరికాకు ఎలాంటి హామీ ఇవ్వలేదన్న భారత్

**డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధ ప్రకటన**

న్యూఢిల్లీ, మార్చి 11: అమెరికా ఉత్పత్తులపై సుంకాల తగ్గింపునకు ఆ దేశానికి భారత్ ఎలాంటి హామీ ఇవ్వలేదని కేంద్ర వాణిజ్య కార్యదర్శి సునీల్ బార్త్వాల్ సోమవారం పార్లమెంటరీ ప్యానెల్‌కు స్పష్టం చేశారు. 'టారిఫ్‌లను తగ్గించడానికి భారత్ అంగీకరించింది' అంటూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై ఆయన పార్లమెంటరీ కమిటీకి వివరణ ఇచ్చారు. ఈ విషయంపై ఇరు దేశాల మధ్య ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని, ఆ దేశానికి ఎలాంటి హామీ ఇవ్వలేదని, ఎలాంటి ఒప్పందం జరగలేదని ఆయన తెలిపారు.



కెనడా ప్రధాని బాధ్యతల నుంచి తప్పుకుంటున్న జస్టిన్ ట్రూడో మంగళవారం పార్లమెంట్ నుంచి బయటకు వస్తూ తన కుర్చీని వెంట తీసుకెళుతూ నాలుక బయటపెట్టి ఇలా ఫన్నీగా ఫొటోలకు పోజిచ్చారు. అక్కడి ఎంపీలు పార్లమెంట్ నుంచి నిష్క్రమించేటప్పుడు కుర్చీలను వెంట తీసుకెళ్లొచ్చు.

### కెనడాపై ట్రంప్ మరో టారిఫ్ బాంబ్

వాషింగ్టన్, మార్చి 11: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాపై మరో టారిఫ్ బాంబు పేల్చారు. కెనడా నుంచి అమెరికా దిగుమతి చేసుకుంటున్న విద్యుత్తు శక్తిపై ఒంటారియో(కెనడా ప్రావిన్స్) పరస్పర సుంకాలు విధించటం ట్రంప్ సర్కార్‌ను మరింత ఆగ్రహానికి గురిచేసింది. దీంతో కెనడా నుంచి దిగుమతి అవుతున్న అన్ని రకాల స్టీల్, అల్యూమినియం ఉత్పత్తులపై సుంకాల్ని 25 నుంచి 50శాతానికి పెంచుతూ ట్రంప్ సర్కార్ మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది.

## విదేశీ విద్యపై తగ్గిన మోజు!

- 15 శాతం తగ్గిన విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య
- వీసా నిబంధనలు, దౌత్యపర సమస్యలే కారణం

న్యూఢిల్లీ, మార్చి 11: విదేశాలలో ఉన్నత విద్యపై భారతీయ విద్యార్థులకు మక్కువ తగ్గింది. గత ఏడాది గణాంకాలు పరిశీలిస్తే విదేశాలకు వెళ్లిన విద్యార్థుల సంఖ్యలో 15 శాతం తగ్గుదల నమోదైంది. కొవిడ్ తర్వాత ఇలా తగ్గుదల నమోదవ్వడం ఇదే ప్రథమం. 2023లో వీరు 8,92,989 మంది ఉండగా, 2024 నాటికి 7,59,064కు పడిపోయింది. ముఖ్యంగా, కెనడా, అమెరికా, యూకేలకు వెళ్లే వారి సంఖ్య భారీగా తగ్గిందని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ డాటా వెల్లడించింది. 2024లో ఈ మూడు దేశాల్లోనే 27 శాతం విద్యార్థులు తగ్గినట్టు తెలిపింది. కఠినతర వీసా నిబంధనలు, ఎక్కువ మొత్తంలో ఫీజులు, ఇతర ఆర్థిక డిమాండ్లు, పెరిగిన తిరస్కరణలు, ఆయా దేశాల్లోని దౌత్యపరమైన సమస్యలు ఈ తగ్గుదలకు కారణంగా అంచనా వేస్తున్నారు. అదే సమయంలో ప్రత్యామ్నాయ దేశాలైన రష్యా, జర్మనీ, ఉజ్బెకిస్థాన్, బంగ్లాదేశ్‌లకు వెళ్లే విద్యార్థుల సంఖ్య పెరిగింది. బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ వెల్లడించిన డాటా ప్రకారం గత ఏడాదితో పోలిస్తే 2024లో యూఎస్, యూకే, కెనడా వెళ్లే విద్యార్థుల సంఖ్య 1,64,370 తగ్గింది. ఇందులో కెనడాకు 41 శాతం అధిక తగ్గుదల నమోదైంది. ఈ దేశానికి 2023లో 2,33,532 మంది వెళ్లగా, 2024లో ఈ సంఖ్య 1,37,608 మాత్రమే. అలాగే యూకే, అమెరికాలకు కూడా వరుసగా 27, 13 శాతం తగ్గుదల నమోదైంది. అదే సమయంలో రష్యాకు 34 శాతం విద్యార్థుల సంఖ్య పెరిగింది. అందుబాటులో విద్య, సులభతరమైన వీసా విధానాలు, విద్యాసంస్థల భాగస్వామిక ఒప్పందాల వల్ల విద్యార్థులకు ప్రత్యామ్నాయ, ఆకర్షణీయ దేశంగా రష్యా కన్పిస్తున్నది.



**విదేశాలకు వెళ్లిన భారతీయ విద్యార్థులు**

2023-8,92,989
2024-7,59,064

కెనడాకు వెళ్లే విద్యార్థుల్లో తగ్గుదల 41%

రష్యాకు వెళ్లే విద్యార్థుల్లో పెరుగుదల 34%

## రష్యాపై డ్రోన్ల వర్షం

- ఏకంగా 343 డ్రోన్లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్
- ముగ్గురి మృతి.. 17 మందికి గాయాలు
- రైలు, విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం
- రష్యా దాడులకు ప్రతీకారం
- కాల్పుల విరమణపై అమెరికాతో చర్చల వేళ ఉక్రెయిన్ చర్య



ఉక్రెయిన్ డ్రోన్ల దాడి వల్ల మాస్కో శివార్లలో దెబ్బ తిన్న కార్లు

మాస్కో: రష్యాతో యుద్ధం మొదలయ్యాక ఆ దేశంపై ఉక్రెయిన్ మొదటిసారి భారీగా డ్రోన్లతో దాడి చేసింది. సోమవారం అర్ధరాత్రి 10 ప్రాంతాలపై 343 డ్రోన్లతో విరుచుకుపడింది. ఇటీవల తమ విద్యుత్తు గ్రిడ్లు లక్ష్యంగా రష్యా బాలిస్టిక్ క్షిపణులు, 126 డ్రోన్లతో తమపై దాడి చేసిందని, దానికి ప్రతీకార చర్యగానే తాజా దాడి చేసినట్టు కీవ్ వర్గాలు తెలిపాయి. మాస్కోతో పాటు సరిహద్దు ప్రాంతాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్టు తెలుస్తున్నది. కేవలం రాజధాని మాస్కోపైనే 91, కుర్స్క్ పైకి 126కి పైగా డ్రోన్లు దాడి చేశాయని ఆ నగర మేయర్ సెర్గీ సొబ్యానిన్ తెలిపారు. దాడులను సమర్థంగా ఎదుర్కొన్నట్టు చెప్పారు. కాగా డ్రోన్ దాడుల వల్ల విమానాలు, రైళ్ల సేవలకు అంతరాయం ఏర్పడింది. కార్లు, భవనాలు దెబ్బ తిన్నాయి. మాస్కోలోని నాలుగు ఎయిర్‌పోర్టులను మూసివేశారు. సాయంత్రానికి రాకపోకలను పాక్షికంగా పునరుద్ధరించినా, పలు సర్వీసులను మళ్లించారు.

**ఒక వైపు చర్చలు.. మరోపక్క దాడులు**

రష్యాతో కాల్పుల విరమణకు సంబంధించి ఉక్రెయిన్ అధికారులు అమెరికాతో సౌదీ అరేబియాలో మంగళవారం చర్చలు జరపనుండగా ఈ దాడులు జరిగాయి. డ్రోన్ల దాడిలో ముగ్గురు మృతి చెందగా, 17 మంది గాయపడ్డారని రష్యా అధికారులు తెలిపారు. కీవ్ మంగళవారం చేసిన దాడికి ప్రతీకారంగా మాస్కో ఒరెష్నిక్ హైపర్ సానిక్ క్షిపణితో దాడికి సిద్ధంగా ఉందని రష్యా మాజీ రక్షణ మంత్రి కర్నల్ జనరల్ ఆండ్రీ కర్తపోలేవ్ హెచ్చరించారు.



### మోదీకి మారిషస్ అత్యున్నత పురస్కారం

పోర్టు లూయిస్: భారత ప్రధాని మోదీకి మారిషస్ ప్రభుత్వం ఆ దేశ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించింది. ఈ పురస్కారం అందుకోనున్న భారతీయులలో మోదీ మొదటి వారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం మారిషస్‌కు చేరిన మోదీకి, ప్రధాని రామ్‌గోలం ఘన స్వాగతం పలికారు. అనంతరం మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్‌తో మోదీ భేటీ అయ్యారు. గోకుల్, ఆయన సతీమణి వృంద గోకుల్‌కు కుంభమేళా పవిత్ర గంగాజలాన్ని మోదీ బహుమతిగా ఇచ్చారు. బీహార్‌కు చెందిన ఆహార పదార్థం మఖానాను అధ్యక్షునికి, బెనారస్ సిల్క్ చీరను ఆయన సతీమణికి బహూకరించారు. అలాగే రామ్‌గోలం, ఆయన సతీమణి వీణా రామ్‌గోలంకు ప్రధాని ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డులను అందజేశారు.

### మొక్కలకు మైక్రోప్లాస్టిక్ తెగులు!

న్యూఢిల్లీ: మైక్రోప్లాస్టిక్‌లు మొక్కల కిరణజన్య సంయోగ క్రియను దెబ్బ తీస్తున్నాయని, 2040 నాటికి 40 కోట్ల మంది ఆకలితో అలమటించే ప్రమాదముందని చైనా పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. నాన్జింగ్ యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం, కాలుష్యం వల్ల మక్కలు, వరి, గోధుమ తదితర పంటలు ఉనికిలో లేకుండా పోతున్నాయని, ప్రధాన పంటల్లో 4 నుంచి 14 శాతం వరకు నష్టపోతున్నాయని పరిశోధకులు అంచనా వేశారు. 2058 నాటికి ప్రపంచ జనాభా 1,000 కోట్లకు చేరుకోనున్న నేపథ్యంలో సరిపడా ఆహారాన్ని ఉత్పత్తి చేయటం సవాల్‌గా మారుతుందని హెచ్చరించారు. దీంతో ప్రపంచ ఆహార భద్రతకు తీవ్ర ముప్పు పొంచి వుందని, కాలుష్య కారణంగా ఆహార సరఫరా గణనీయంగా తగ్గుతుందని వారు తెలిపారు. ఇప్పటికే (2022నాటికి) ఆకలి సంక్షోభం పెరగటంతో 70 కోట్ల మందిపై దాని ప్రభావం పడిందని, మైక్రోప్లాస్టిక్స్ కాలుష్యం ఇదే విధంగా సాగితే తీవ్ర ముప్పు వాటిల్లుతుందని అధ్యయనం పేర్కొన్నది.

## ఆయుధాల దిగుమతిలో భారత్ నంబర్ 2

**మొదటి స్థానంలో ఉక్రెయిన్ ▪ సిప్రి తాజా నివేదికలో వెల్లడి**

*ఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా ఆయుధాలు దిగుమతి చేసుకునే దేశాల్లో ఉక్రెయిన్ టాప్‌లో నిలిచింది. రష్యాతో యుద్ధం ప్రభావం వల్ల ఉక్రెయిన్ దిగుమతులు భారీగా పెరిగాయి. 2015-19తో పోలిస్తే 2020-24 మధ్య ఆ దేశ దిగుమతులు 100 రెట్లు పెరగడం గమనార్హం. అదే సమయంలో ఉక్రెయిన్ తర్వాత రెండో స్థానంలో భారత్ నిలిచింది. భారత్ దిగుమతులు 9.3 శాతం తగ్గినప్పటికీ ద్వితీయ స్థానంలో నిలిచింది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక ఈ వివరాలు తెలిపింది.*



**టాప్ దిగుమతిదారులు ప్రపంచ దిగుమతుల్లో వాటా**

- ఉక్రెయిన్-8.8%
- భారత్-8.3%
- కతార్-6.8%
- సౌదీ అరేబియా-6.8%
- పాకిస్థాన్-4.6%
- జపాన్-3.9%

**టాప్ ఎగుమతిదారులు- ప్రపంచ ఎగుమతుల్లో వాటా**

- అమెరికా -43%
- ఫ్రాన్స్- 9.6%
- రష్యా -7.8%
- చైనా -5.9%
- జర్మనీ-5.6%
- ఇటలీ-4.8%

**ఉక్రెయిన్ దిగుమతులు ఇలా..**

- అమెరికా- 45%
- జర్మనీ- 12%
- పోలండ్- 11%

**ఉక్రెయిన్‌కు సుమారు 35 దేశాలు ఆయుధాలను ఎగుమతి చేశాయి**

**భారత్ దిగుమతులు ఇలా..**

- రష్యా (38%)
- ఫ్రాన్స్ (28 %)



- అమెరికా ఎగుమతులు 21 శాతం పెరిగాయి. ఆ దేశం ఉక్రెయిన్ సహా 107 దేశాలకు ఆయుధాలు ఎగుమతి చేసింది.
- రష్యా ఎగుమతుల్లో 64 శాతం క్షీణత నమోదైంది.
- 1990-94 తర్వాత మొదటిసారి చైనా టాప్-10 దిగుమతిదారుల లిస్ట్‌లో చోటు దక్కలేదు.
- రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా నాటో దిగుమతులు 155 శాతం పెరిగాయి.
- ప్రపంచవ్యాప్తంగా 2010-14 నుంచి 2015-19 మధ్యకాలంతో పోలిస్తే ఆయుధాల వ్యాపారం స్థిరంగానే ఉంది. అయితే, 2005-09తో పోలిస్తే 18 శాతం పెరుగుదల నమోదైంది.
- పాకిస్థాన్ దిగుమతులు 61 శాతం పెరిగాయి. 81 శాతంతో చైనా ఆ దేశపు అతిపెద్ద సప్లయర్‌గా మారింది.

### సంపద సృష్టించే బ్యాంకు మట్టి!

**చైనాలో ఆన్‌లైన్‌లో అమ్మకం**

బీజింగ్, మార్చి 11: సంపదను, అదృష్టాన్ని తెచ్చి పెడతాయని ప్రచారం చేస్తూ ప్రధాన బ్యాంకుల బయట తవ్విన మట్టిని 'బ్యాంకు మన్ను' పేరిట చైనాలోని ఆన్‌లైన్ షాపులు అమ్మకం సాగిస్తున్నాయి. ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఈ వస్తువును రూ.10,500 ధరకు విక్రయిస్తున్నాయి. బ్యాంకుల బయట నుంచి, బ్యాంకు వరండాలలో ఉంచిన కుండీల నుంచి తీసిన మట్టితోపాటు డబ్బును లెక్కించే యంత్రాల వద్ద పడిన దుమ్మును కూడా సేకరించి విక్రేతలు అమ్ముతున్నట్టు సౌత్ చైనా మార్నింగ్ పోస్టు తెలిపింది. చైనాలోని ప్రధాన బ్యాంకులైన బ్యాంక్ ఆఫ్ చైనా, ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా, అగ్రికల్చరల్ బ్యాంక్ ఆఫ్ చైనా, చైనా కన్‌స్ట్రక్షన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ కమ్యూనికేషన్స్ నుంచి సేకరించిన నాలుగు రకాల మట్టిని అమ్మకానికి ఉంచినట్టు ఆన్‌లైన్ విక్రేతలలో ఒకరు తెలిపారు. ఈ నాలుగు రకాలలో అత్యంత చవక మట్టి ధరను రూ. 260గా నిర్ణయించినట్టు ఆయన చెప్పారు. తాము అమ్ముతున్న మట్టి నూటికి 99.99 శాతం సంపదను సృష్టించడంలో విజయం సాధించినట్టు మరో విక్రేత వెల్లడించారు.